# దిబ్బప్రభువుగారితో ఇంటర్వ్యూ

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

సాయంకాలము అయిదుగంటలకు ప్రభువుగారి దర్శనం అవుతుందని కోటనుంచి నాక్కాభురొచ్చింది. నా మామూలు దుస్తులతోనే ప్రభువువారిని దర్శించటానికి అనుమతి వచ్చిందిగాని శ్రీ వారికి అథమం మూడు శ్రీలైనా తగిలించక తప్పదని ఉత్తరువయింది. విప్లవకవుల దగ్గిర్నుంచీ రెండేసి శ్రీలు తగిలించుకున్నారు గనుక నున్నున్నున్నా, కథల్లో బోడెమ్మలకు సహితం రెండేసిశ్రీలు ఉంపింపించబడుతున్నాయి గనుక నున్నున్నున్నా నేను శ్రీ వారిని శ్రీ శ్రీ శ్రీ వారనక తప్పదని కోటవారు నాకు తెలియబరిచారు.

శ్రీ వారు, తోటలో నన్ను ఇంటర్వ్యూ చేస్తారని తెలిసింది. నాకు తోటకన్న శ్రీ వారే ముందవుపించారు. ఇంతకూ నాకు తోట అవుపించనేలేదు. ఒకపక్కగా వెడల్పైన ఆకులుగల మొక్కొకటి కనిపించింది. అక్కడక్కడ ఎండిపోయిన మొక్కలు పొదలుపొదలుగా కనిపించాయి.

“ఇదేనా శ్రీ శ్రీ శ్రీ వారి తోట?” అన్నాను.

“ఇంకా ఉన్నాయి. కాని అన్నిటిలోకీ ముఖ్యమైనదిదే.” అన్నారు శ్రీ వారు, దక్షిణంగానూ, తూర్పుగానూ ఉన్న చెట్ల సముదాయాలు చూపుతూ. ఆ తోటలు పెద్దపెద్ద చెట్లతో కూడిఉన్నాయి. చూడటానికి తోటలంటే నమ్మశక్యంగా ఉన్నాయి. శ్రీ వారు నా సందేహం తీర్చారు:

ఈ తోట మా ముత్తాతగారు దుక్కప్రభువుగారు వేసినటువంటిది. ఇవన్నీ అప్పుడు వారిచేత్తో వేయింపించిన మల్లెతోటలు... ఆహా! మల్లెల సౌరభం ఆ కాలంలో చూడవలసింది! జగ్గకవిగారు ఈ తోటలో మల్లెల్ని వర్ణించి, సురలోకంలో ఉండుకున్నటువంటి పారిజాతాలు వీటితో పోలవని స్పష్టంగా చెప్పారు. మహాకవి!”

“శ్రీ శ్రీ శ్రీ వారి అభిప్రాయంలో మల్లెలకు రానురాను వాసన తగ్గుతోందనా?” అని అడిగాను ఆశ్చర్యంతో.

“అందుకు సందేహం ఏమీలేదు. అన్ని పూలకీ వాసన తగ్గుతోంది. మనుషులంతా నీరసించిపోతున్నట్టే. మీలాగా పాశ్చాత్య సంస్కారంగల వారీ సత్యాలని నమ్మరు.”

“శాస్త్రీయమైన ఆధారం ఉంటే—”

“లేకేం ఉంది. మల్లెపూలే తీసుకోండి. ప్రపంచంలో అన్నిటికీ ఏదో పరిమితి ఉంటుందని ఒప్పుకుంటారా?”

“ఒప్పుకుంటాను.”

“అయితే మల్లెపూల సౌరభం పరిమితంగా ఉంటుందని మీరే ఒప్పుకుంటున్నారు. ఆ సౌరభం కొద్దీ పూల నాశ్రయించినప్పుడున్న సాంద్రత అసంఖ్యాకమైనటువంటి పుష్పజాలానికి సంక్రమించే సరికి—”

“ప్రభువువారి అభిప్రాయం అర్థమైంది. మనుషుల సంఖ్యకూడా పెరిగినకొద్దీ వ్యక్తులు నిర్వీర్యులవుతారని తమ అభిప్రాయం కాదా?”

“అవును ఇరవయ్యో శతాబ్దమధ్యంలో మోటిపుట్టగొడుగుల్లాటి మనుషులు పుడతారనీ, వాళ్లు యుద్ధాలుచేసేటప్పుడు శత్రుసేనల మధ్య యోజనాల

కొద్దిదూరం ఉంటుంది తప్ప బాహాబాహీకచాచి యుద్ధం చెయ్యరనీ నేను ఘట్టిగా చెప్పగలను."

"యుద్ధమంటే స్ఫురించింది—అడగదగిన ప్రశ్న అవునో కాదో తెలీదు— తమకూ సన్నం రాజుగారికీ యుద్ధం తప్పదని పుకారుగా ఉంది. ఇది ఎంతవరకు నిజమో సెలవివ్వటానికి శ్రీ శ్రీ శ్రీ వారికేమైనా అభ్యంతరం—"

"ఏమీలేదు, ఒక్కటే ముక్క చెబుతున్నాను. నేను శాంతి కోరేవాణ్ణి. నాకు యుద్ధాలంటే అసహ్యం. నా ప్రజల క్షేమమే నాకు కావలసింది. సన్నంరాజుగారు కయ్యానికి కాలుదువ్వుతాడు. నే నాయన ఎత్తులకు లొంగనని ఆయనకు తెలీదు. ఈ మధ్య తమ దూతను పంపి సన్నం రాజుగారు, నాకు ముప్ఫైవేల కత్తులు అవసరంగా కావాలి. రెండువేల గుర్రాలు కావాలి. ఇవి వెంటనే తమ కోష్ఠాగారాల నుంచీ, అశ్వశాలల నుంచీ ఇప్పిస్తారా యుద్ధానికి వస్తారా?" అని కబురుచేశారు. 'కావలిస్తే అంతకు రెట్టింపు కత్తులిస్తానన్నాను గుర్రాలుకూడా ఇచ్చేస్తానన్నాను, కాని యుద్ధానికి ఒప్పుకోలేదు. చూశారా నాయుక్తి?"

నా గుండె ఎగిరి గొంతులో కూచుంది.

"ఇదంతా ఉచితంగానే—"

"లేదు; సన్నం రాజుగారి దగ్గిర చక్కని బాణా సంచా తయారుచేసే వాళ్లున్నారు. కత్తులు కొలవకీ, గుర్రాల విలవకీ సరిపడా బాణాసంచా పంపుమన్నాను."

"అడుక్కుతిన్నట్టే ఉంది నీ తెలివి." అని లోపల అనుకుని, పైకి, "దారితప్పి యుద్ధం జరిగితే ఆత్మ రక్షణ సన్నాహా లేంచేస్తారు?"

"ఏముంది చెయ్యటానికీ? నా మాట శిరసావహించే నా బిడ్డల్లాటి ప్రజ ఉన్నారు. వాళ్లు చచ్చయినాపోతారు గాని ఓటమికి ఒప్పుకోరు."

"క్షమించండి. మీ ఏలుబడిలో సస్యసమృద్ధి చాలా తక్కువగా ఉన్నట్టు కనిపించింది. అనేక చోట్ల నీటివసతులులేక పంట ఎండిపోతున్నాయి. చెరువుల్లో పూడు తీస్తున్నట్టు కనిపించదు. ఆహార సమృద్ధిలేని ప్రజలు యుద్ధం చెయ్యగలరా?"

"పిచ్చివాడా, శరీరబలంతో పోరే వాడేం పోరగలడు? దైవబలం ఉండాలి. చెరువుల విషయమూ, పొలాల విషయమూ నే నంగీకరిస్తాను. కాని ఏం చెయ్యను? నేనాట్టే ఖర్చుదారును కాను. నాకు సరిపడా రాబడి ఉంది. ఉన్న పొలాలన్నీ బాగు చేయించి పండించి ఆ పంటంతా ఏంచేసుకుంటాం?"

"తమ యేలుబడిలో అందరికీ తిండి సమృద్ధిగా ఉందా? తిండికి మాడే ప్రజలున్నట్టు కనిపిస్తారే?"

"పనిచెయ్యనివారికి తిండిలేదేమోగాని పనిచేసే వారందరికీ కడుపునిండా తిండి ఉంది."

"పనిలేని వాళ్లకి సాగుబడిచెయ్యని పొలాలివ్వరాదా? చెరువులు బాగుచేయించరాదా?"

"నాకీ రాబడి చాలునని చెప్పానుగా! నేను కొందరు కొందరు రాజుల్లాగ ఖర్చుదారును కాను. నారాబడి ఇంకా తగ్గిపోయినా నేను సుఖంగా బతకగలను. అందుచేత కొన్ని పొలాలు బీడుపెట్టేయిద్దామనుకుంటున్నాను."

"మరింత మంది తిండికిమాడి చావరా?"

"నా పొలాలు నేను బీడుపెట్టటానికి ఒకరి ఆజ్ఞ కావాలా?" అన్నారు ప్రభువువారు కళ్లెర్రజేసి.

"క్షమించాలి, ప్రభువులు. నేను చెప్పిందేమంటే ప్రజలు తమ నిర్ణయాన్ని అంత నయంగా ఆమోదిస్తారా అని."

"వాళ్లు దైవభక్తిపరులు. భగవంతుడిస్తే దొరుకుతుందనీ, లేకపోతే లేదనీ వాళ్లెరుగుదురు."

"వాళ్లకి విద్యాసౌకర్యా లేవిధంగా ఉంటాయి తమ ఏలుబడిలో."

# ఆంధ్ర శిల్పి

"విద్యలో నాకు విశ్వాసం లేదు. శరీరంవొంచి కష్టించే ప్రజలు చదువు మరిగితే పనిచెయ్యరు. కవిత్వాలు చెప్పి కానుకలు గుంజుతారు. నాకు కవిత్వమంటే మంట. వచనం అర్థమయినంత సులువుగా మనకు ఎప్పుడన్నా పద్యం అర్థమవుతుందా? అదీకాక చదువుకోవాలంటే ఇప్పటికే ఎన్నో మహా గ్రంథాలున్నాయి. ఒక్క భారతం చాలదా జన్మల్లా చదవటానికి. నేను పదిహేనేళ్ళ నుంచీ చదువుతున్నాను, ఆరణ్యపర్వం అవకుండా ఉంది. భారతం తెరిచేసరికి నాకు బ్రహ్మానందమై సుషుప్తి కలుగుతుంది. మహాకావ్యం! మహాకావ్యం!"

"తమ యేలుబడిలో పరిశ్రమ లెట్లా ఉన్నాయి?"

"ఉన్నాయి. ఫరవాలేదు. వడ్రంగులూ, కమ్మరవాళ్లూ, సాలెవాళ్ళూ ఉన్నారు. ఇకేం కావాలి?"

"సన్నంరాజుగారి పరిపాలనలో పరిశ్రమలు బాగా సాగుతున్నాయని విన్నాను?" అందుచేతనే అతన్ని బొమ్మనుచేసి ధనికులంతా ఆడిస్తున్నారు. మళ్ళీ ఎక్కడా అనకండి; సన్నంరాజును నా మీదికి ఉసికొల్పే వాళ్లు పారిశ్రామికులే. వాళ్లకి మా రాజ్యంలో ఉండే ఇనపమట్టి కావాలి. నారాజ్యంలో తయారయే కత్తులన్నీ ఇమ్మన్నా ఇస్తానుగాని ఆ ఇనపమట్టి సన్నంరాజుకి దక్కనిస్తానా? మా తాతగారు చెబుతుండేవారు: ఆ మట్టిలో కోటానకోట్లు కత్తులున్నాయని. అమ్మా? నేనేం వెర్రికుట్టైనా?"

విన్న సంగతులతో నాకు మొహం మొత్తింది. నేను సెలవు పుచ్చుకోవటానికి ఉపక్రమిస్తూండగా నాకన్ను ఆ తోటలో ఉన్న ఒక్క మొక్కమీద పడింది. అదే తోటలకల్లా మహోన్నతంగా ఉంది.

"ఇదేం వృక్షమో తెలుసుకోవచ్చునా?" అన్నాను.

శ్రీవారు నవ్వి, "విత్తు దొరికినప్పుడు నాకు అదే సందేహం కలిగి నాటిచూశాను. చెట్టు పెరిగాక అది ఆముదపు చెట్టని శాస్త్రవేత్తలు చెప్పారు" అన్నారు.

"తమరు ఈ తోటలో మరికొన్ని చెట్లుకూడా వేయించలేకపోయారా?" అన్నాను.

"వేయించాను, కాని అవి దీన్నిమించి పెరగాయి. అంచేత కొట్టింపించవలసొచ్చింది," అన్నారు శ్రీవారు ఆముదపు చెట్టువేసి గర్వంగా చూస్తూ.

